క్లుప్తంగా

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

సుల్తానాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పద్మశాలీ రాష్ట్ర విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ నిశాంత్ పుట్టిన రోజు సందర్భంగా మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయాలనే సంకల్పంతో పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు ఆయన తెలిపారు. యువ సంకల్ప ఫౌండేషన్ చైర్మన్ తుమ్మ రాజ్‌కుమార్, ఫౌండేషన్ కోశాధికారి తుమ్మ వెంకటేశం, సభ్యులు ఆషాడపు క్రాంతికుమార్, దేశెట్టి రమేశ్, వెనగంటి వరుణ్‌తేజ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


పాఠశాల కమిటీ చైర్మన్లతో సమావేశమైన ఎంపీడీవో

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పించిందని, ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల కమిటీ చైర్మన్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను సత్వరమే పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈనెల 3 నుంచి బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో సురేంద్రకుమార్ తెలిపారు. అప్పన్నపేట హెచ్‌ఎం పురుషోత్తం, ఏపీఎం సంపత్, సీఆర్‌పీలు, హెచ్‌ఎం, కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై అవగాహన ఉండాలి

సుల్తానాబాద్: విద్యార్థి దశ నుంచే క్రీడలపై అవగాహనతోపాటు క్రీడల్లో రాణించాలని జాతీయ వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు గాజుల రాజమల్లు అన్నారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. సెంటర్ ఇన్‌చార్జి గెల్లు మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం


సాంబశివరావును సత్కరిస్తున్న సదానందం

పెద్దపల్లిరూరల్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును శనివారం జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సత్కరించారు. జిల్లాలోని గోదావరిఖని పర్యటనకు వచ్చిన సాంబశివరావు మార్గమధ్యంలో పెద్దపల్లిలో కాసేపు ఆగారు. జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రజాసమస్యలపై ఉద్యమిస్తున్న తీరు తదితర అంశాలపై చర్చించినట్లు సదానందం తెలిపారు.

గుండెపోటుతో యూడీసీ మృతి


అనీసోద్దీన్(ఫైల్)

ఓదెల: ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే యూడీసీ అనీసోద్దీన్(50) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఓదెలలో విధులను ముగించుకొని ఇంటికి వెళ్లిన అనీసోద్దీన్‌కు చెమటలు, ఛాతిలో నొప్పి రావటంతో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. మృతుడి కుటుంబాన్ని ఓదెల డాక్టర్ షాబోద్దీన్, సిబ్బంది పరామర్శించారు.

పరామర్శ

జూలపల్లి: అబ్బాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన గొల్ల రామమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 50కిలోల బియ్యాన్ని అందజేశారు. నేనున్నా స్వచ్ఛంద సంస్థ సభ్యుడు పల్లె సురేశ్, బీఆర్‌ఎస్ నాయకులు నల్లల కనకరాజు, గొడిసెల నర్సయ్య, ధర్మయ్య, మూగల అంజయ్య, గొల్ల కొండయ్య, జనార్దన్ తదితరులున్నారు.

20 మంది రైతులకు గోశాల పశువులు



ఓదెల: మడక గ్రామంలో 20 మంది రైతులకు సద్గురు సమర్ధ నారాయణ జియాగూడ హైదరాబాద్‌కు చెందిన గోశాల నుంచి మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్ పశువులను శనివారం అందజేశారు. వ్యవసాయానికి ఎద్దులు, ఆవులను 20 మంది రైతులకిచ్చారు. వ్యవసాయ గ్రామమైన మడకలో గోశాల నుంచి పశువులను అందజేసి ఔదార్యం చాటుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొస్కె రాజేశం పాల్గొన్నారు.


రామగుండం: శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో..


రామగిరి: బుదవారంపేటలో..


కాల్వశ్రీరాంపూర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు

జై బోలో హనుమాన్‌కీ..

పెద్దపల్లిరూరల్/రామగుండం/సుల్తానాబాద్/ఎలిగేడు/జూలపల్లి/రామగిరి/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్‌రూరల్/ఫెర్టిలైజర్‌సిటీ/ఓదెల/యైటింక్లయిన్‌కాలనీ/ముత్తారం: జై బోలో హనుమాన్ కీ.. రామలక్ష్మణజానకీ.. జై శ్రీరాం.. జైజై శ్రీరాం.. జై హనుమాన్.. జైజై హనుమాన్ నినాదాలతో అంజన్న ఆలయాలు శనివారం మార్మోగాయి. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా జిల్లాలో వేకువజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అన్నదానాలు నిర్వహించారు. మజ్జిగ వితరణ చేశారు. స్వాములు ప్రత్యేక పూజలు చేసి మాల విరమణకు కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జూలపల్లి: అబ్బాపూర్ నుంచి మాల విరమణకు వెళ్తున్న స్వాములు


ఫెర్టిలైజర్‌సిటీ: ఆలయంలో హోమం


పెద్దపల్లిరూరల్: ఆలయంలో భక్తుల పూజలు


సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వలలో హనుమాన్ విగ్రహానికి పాలాభిషేకం


జ్యోతినగర్: మజ్జిగ అందిస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

'అక్రమ కట్టడాలపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు విడ్డూరం'

రామగిరి: నాగెపల్లి గ్రామంలో ఆక్రమించి ఇళ్లు కట్టిన కాంగ్రెస్ నాయకులు అక్రమ కట్టడాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. శనివారం నాగెపల్లి క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారముందని ఇష్టారీతిన ఇళ్లు కూల్చడం సరికాదన్నారు. మాజీ సర్పంచ్ కొండవేన ఓదేలు, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గద్దల శంకర్, సీనియర్ నాయకుడు వేగొలపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు అర్థరహిత ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రహదారి వెంట ఉన్న దుకాణాల వారికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, బొమ్మగాని అనిల్, పొన్నం రాజేశ్వరి, గుర్రం లక్ష్మీమల్లు, కొట్టే భూమయ్య, తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, నీలం శ్రీనివాస్, సాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి చందనాపూర్‌లోని రెండు బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.1,12,600 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. శ్రీరామ కిరాణంలో రూ.85,240, జలీల్ కిరాణంలో రూ.27,200 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. యజమానులు గట్టు శ్యాంసుందర్, ఎండీ.జలీల్‌లను విచారణ నిమిత్తం టూటౌన్ పోలీసులకు అప్పగించామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యాసంవత్సరం ప్రవేశాల వేళ..

- ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోండి
- విద్యార్థులకు విద్యావేత్తల సూచన

జ్యోతినగర్: టెన్త్, ఇంటర్, ఎంసెట్, నీట్, పాలిసెట్, నీట్, జేఈఈ.. ఇలా పలు ప్రవేశ పరీక్షలు జరిగి కొన్నింటికి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఈ సందర్భంగా పైతరగతులకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వ కార్యాలయాల నుంచి తీసుకునే విషయంలో ప్రతి ఒక్క విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. చివరి వరకు వేచి చూడకుండా ముందస్తుగా ధ్రువపత్రాలు పొందేలా చూసుకోవాలని పేర్కొంటున్నారు. కళాశాలల్లో ప్రవేశాలు, ఉద్యోగ నియామక ప్రక్రియల సమయంలో సంబంధిత ధ్రువపత్రాల అవసరం చాలా ఉంటుంది. వాటిని సంబంధిత అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. కనీసం రెండు వారాల ముందుగానే అడిగిన, అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలి. సమయం దగ్గరకు వచ్చాక దరఖాస్తు చేస్తే కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి ఆందోళన, అనవసర యాతన పెరుగుతుంది. ప్రస్తుతం ప్రవేశ పరీక్షల సమయం కొనసాగుతోంది. ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు పోటీ పరీక్షల ఫలితాల్లో ర్యాంకులు పొందినవారి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ముందుగానే పొందాలి. జిల్లాలోని విద్యార్థులు ఆదాయ, కుల, స్థానిక ధ్రువపత్రాలకు సంబంధించి ఆయా మండలాల్లోని తహసీల్ కార్యాలయాల నుంచి పొందాల్సి ఉంటుంది. కార్యాలయాల పరిధిలో ఉన్న విద్యార్థులు ముందుగానే దరఖాస్తులు చేసుకొని పత్రాలను పొందాలని రెవెన్యూ వర్గాలు సూచిస్తున్నాయి.

కావాల్సినవి..

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి కుల, ఆదాయ, స్థానిక, నాన్ క్రిమిలేయర్ వంటి ధ్రువపత్రాలు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. పాతవి ఉంటే వాటి స్థానంలో కొత్తవి పొందాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన ఓబీసీ, ఆర్థికంగా బలహీనవర్గాల ధ్రువపత్రాల అవసరముంటుంది. ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంవత్సర కాలపరిమితి ఉంటుంది. తాజాగా ఏప్రిల్ తర్వాత జారీ చేసినవి మాత్రమే చెల్లుబాటవుతాయి.

దళారులను ఆశ్రయించొద్దు



విద్యార్థులు తహసీల్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించొద్దు. వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నూతన కోర్సులకు సంబంధించి విద్యార్థులకు ఉపయోగపడే ధ్రువపత్రాల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దరఖాస్తు చేసుకున్న వెంటనే త్వరగా పరిశీలించి అందజేస్తాం.

– కుమారస్వామి, తహసీల్దార్, రామగుండం

సామాజిక తనిఖీలో అనుమానాలెన్నో?

- ఇన్‌హౌస్ పేరిట తూతూ మంత్రంగా ముగింపు
- ఎన్నికల కోడ్ ఉందంటూ సమాచారం దాటవేత



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

మంథని: గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా ఊతం అందించే ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల సామాజిక తనిఖీ చేపట్టడం ఏటా సాధారణమే. పథకం అమలులో జరిగే అవకతవకలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించడం తనిఖీ బృందం ప్రధాన బాధ్యత. ఈ క్రమంలో సామాజిక తనిఖీ బృందాలు వివిధ గ్రామాల్లో పర్యటించి సమగ్ర వివరాలు సేకరించాయి. పథకంలో జరిగిన లోటుపాట్లను అందరి ముందు బహిరంగ వేదికపై వెల్లడించమే సామాజిక తనిఖీ ప్రధాన లక్ష్యం. అయితే, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు ఇన్‌హౌస్ పేరిట నిర్వహించిన సామాజిక తనిఖీ తూతూమంత్రంగా సాగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించి 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అయితే, అనేకచోట్ల పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు గ్రామాల్లో చర్చ సాగుతుండగా.. సామాజిక తనిఖీ ప్రజావేదిక ఇన్‌హౌస్‌లో చేపట్టడం ద్వారా సమాచారం బయటకు రాలేదు. ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకొని అధికారులు సైతం ఎవరికీ సమాచారం ఇవ్వకుండా తనిఖీని నామమాత్రంగా ముగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు అమృత్ కుమార్, సత్యనారాయణ, జిల్లా అంబుడ్స్ పర్సన్ శరత్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కొమురయ్య, మేనేజర్ గణేశ్, అధికారులు, సామాజిక తనిఖీ బృందం తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో చనిపోయి.. ఇద్దరికి చూపునిచ్చి..

జ్యోతినగర్: జిల్లాలో వడదెబ్బతో ఓ యువకుడు చనిపోగా.. పుట్టెడు దుఃఖంలోనూ ఆయన కుటుంబ సభ్యులు ఉదారత చాటుకున్నారు. ఆయన కళ్లు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన ఈదునూరి కిషోర్(37) శుక్రవారం కొండగట్టు దేవస్థానం వెళ్లేందుకు హనుమాన్ స్వాములతో కలిసి కాలినడకన బయలుదేరారు. ధర్మారం మండలం రాజారాంపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే.. ఎండదెబ్బతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. కిషోర్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. కిషోర్ నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించొచ్చని కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. కొంకటి లక్ష్మీనారాయణ మృతుడికి సమీప బంధువు కావడంతో.. మృతుడి తల్లిదండ్రులు ఉమ్మయ్య, శంకరమ్మ, సోదరులు అశోక్, కిరణ్, సోదరి లలిత, బావ శంకర్ అంగీకారం తెలిపారు. సమాచారం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సూచనతో శనివారం ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ నరేందర్ సహకారంతో ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, ప్రతినిధి అనుమాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తోపాటు కొంకటి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి తదితరులు నివాళి అర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారు నూక రమేశ్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, పట్టణ అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, శశికళ, శారద, దేవి లక్ష్మీనారాయణ, అనుమాల లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.


సేకరించిన నేత్రాలను సదాశయ బృందానికి అందిస్తున్న కిషోర్ కుటుంబ సభ్యులు

అమరవీరులకు నివాళి

గోదావరిఖని: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాట యోధులకు ఘన నివాళి అర్పించారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, నాగేల్లి సాంబయ్య, వడ్డేపల్లి శంకర్, ఎల్.వెంకటేశ్, చేల్పూరి సతీష్, చల్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీకే-11 గనిలో కార్మికుడికి గాయాలు

గోదావరిఖని: గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతిచెందిన సంఘటన మరవకముందే అదే గనిలో మరో కార్మికుడు గాయాలపాలయ్యాడు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-11 గనిలో జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ కార్మికుడికి గాయాలయ్యాయి. విధి నిర్వహణలో భాగంగా కంటిన్యూస్ మైనర్ వద్ద కట్టర్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో యంత్రం మీద పడటంతో రియాజ్ అనే జనరల్ మజ్దూర్ కాలికి గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహారెడ్డి, కె.సదానందం, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఏరియా ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు.

ఆర్జీ-3లో 94 శాతం, ఏపీఏలో 96 శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: మే నెలలో ఆర్జీ-3లో 94 శాతం, ఏపీఏలో 96 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శనివారం ఆర్జీ-3, ఏపీఏ జీఎం ఎన్.సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే నెలలో ఆర్జీ-3లో నిర్దేశించిన 5.48లక్షల టన్నులకు గాను 5.16లక్షల టన్నులు, 94 శాతం బొగ్గు ఉత్పత్తి, 98 శాతం మట్టి తీయడం, 7.66లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఏపీఏ గనిలో మే నెలలో నిర్దేశించిన 0.92లక్షల టన్నులకు గాను 0.88లక్షల టన్నులు, 96 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతోపాటు 0.87లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని అన్నారు.

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 ఏరియాలో మే నెలలో 136 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎల్వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మే నెలలో 6.29లక్షల టన్నుల ఉత్పత్తికి గాను 8.52లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యానికి మించి 136 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఏరియా నుంచి 8,66,833 టన్నుల రవాణా చేశామని అన్నారు.


డి.రాములు


పి.రఘువంశీ


అమరేందర్‌రెడ్డి


టి.విజయ్


చంద్రశేఖర్


వెంకన్న

ఉత్తమ ఉద్యోగులు వీరే..


రామగిరి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసింది. కొత్తగూడెంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్‌కు ఓసీపీ-1 నుంచి డిప్యూటీ మేనేజర్ డి.రాములు, ఏపీఏ గని నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రఘువంశీ ఎంపికయ్యారు. వీరిని కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సన్మానిస్తారు. ఏరియా స్థాయిలో ఓసీపీ-2 నుంచి ఎక్స్‌ప్లోసివ్ క్యారియర్ ఎస్.అమరేందర్‌రెడ్డి, ఏపీఏ గని నుంచి మల్టీ జాబ్ వర్కర్ టి.విజయ్ ఎంపికయ్యారు. వీరిని సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో నిర్వహించే వేడుకల్లో సన్మానిస్తారు. ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అభినందించారు.


గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 ఏరియా ఉత్తమ ఉద్యోగుల పేర్లను యాజమాన్యం ప్రకటించింది. ఆర్జీ-2 ఏరియా నుంచి ఇద్దరిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వకీల్‌పల్లి గని ఇంజినీర్‌గా పని చేస్తున్న బి.చంద్రశేఖర్ ఉత్తమ అధికారిగా ఎంపిక కాగా.. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే ప్రధాన వేడుకల్లో సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఓసీపీ-3 ఈపీ ఆపరేటర్ రంగిశెట్టి వెంకన్నను ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేశారు. ఆర్జీ-2 ఏరియాలో జరిగే వేడుకల్లో జీఎం చేతుల మీదుగా సన్మానించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

రామగిరి: ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను శనివారం ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు పరిశీలించారు. సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్యారెట్‌పై తెలంగాణ అమరుల స్తూపం





ఓదెల: మడక గ్రామానికి చెందిన ప్రభుత్వ చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ ఆదివారం జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని క్యారెట్‌పై తెలంగాణ అమరులను స్మరిస్తూ స్తూపాన్ని చెక్కాడు. తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని 5.5 సెంటీమీటర్ల ఎత్తు, 1.5 సెంటీమీటర్ల వెడల్పుతో సుమారు మూడు గంటలపాటు శ్రమించి వెజిటబుల్ కార్వింగ్ ఆర్ట్స్ ద్వారా తయారు చేశాడు.

'కాలం చెల్లిన వాహనాలను నడపలేం'


రోడ్డుపై శానిటేషన్ ట్రాక్టర్లు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ చెత్తను సేకరించే ట్రాక్టర్లను 2007 సంవత్సరంలో కొనుగోలు చేశారని, కాలం చెల్లిన ట్రాక్టర్లతో ఉద్యోగం చేయలేమని శానిటేషన్ ట్రాక్టర్ డ్రైవర్లు శనివారం రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలోని పెట్రోల్ బంక్ వద్ద ట్రాక్టర్లతో నిరసన తెలిపారు. ట్రాక్టర్‌లో బ్యాటరీలు లేక చెత్తను సేకరించిన సమయంలో ఉదయం నుంచి పని పూర్తయ్యేవరకు ట్రాక్టర్ ఇంజన్‌ను ఆన్ చేసి ఉంచడంతో డీజిల్ ఎక్కువ మొత్తంలో వినియోగించాల్సి వస్తోందని అన్నారు. ట్రాక్టర్‌లో సరిపడా డీజిల్ పోయకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. ఇండెంట్ ప్రకారం డీజిల్ పోయకుండా తక్కువ మోతాదులో డీజిల్ పోయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ డ్రైవర్లతో చర్చించారు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో డ్రైవర్లు విధులు కొనసాగించారు.